క్లుప్తంగా

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం' నిర్వహణ



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. భీమడోలు గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండే సుధాకర్ చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పుస్తకాలు చదవడానికి ఆసక్తి కనబరచాలని కోరారు. ప్రతి ఒక్కరూ 20 ఏళ్లు చదివితే మిగిలిన 80 ఏళ్లు సంతోషంగా గడుపుతామన్నారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.బంగారు పాప, కె.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



దెందులూరు: గంగానమ్మ

దెందులూరు: కొవ్వలి గ్రామంలో గ్రామ దేవతలు శ్రీగంగానమ్మ, శ్రీకనకాలమ్మ, పోతురాజులకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. కొవ్వలి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వర్షాలు కురిసి పంటలు పండి రైతులతో పాటు అందరూ సుభిక్షంగా ఉండాలని మొక్కుకొని పూజలు చేశారు.

విచ్చలవిడిగా చెట్ల నరికివేత



విద్యుత్ శాఖ అధికారులు నరికేసిన చెట్లు

ఉంగుటూరు: విద్యుత్ లైన్లు లాగడానికి అడొచ్చిన చెట్లను విచక్షణారహితంగా నరికేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చేస్తున్న ఈ పనికి పర్యావరణ ప్రియులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినడానికి కారణం చెట్లను నరికడమేనని వారు వాఖ్యానిస్తున్నారు. కైకరంలో రామన్నగూడెం వైపు లాగే లైన్ల కోసం మాను చెట్లు సైతం నరికేసి అమ్మేస్తున్నారని గ్రామానికి చెందిన కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కోర్ని అప్పారావు విమర్శిస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెదపాడు: పెదపాడు మానవత శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా వడ్లపట్ల ప్రసాద్, కార్యదర్శిగా ఉప్పాల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆలపాటి హనుమంతరావు, కోశాధికారిగా ఇంజమాల బాలశౌరి, సంయుక్త కార్యదర్శిగా చేవూరి వెంకట్రావు ఈసీ సభ్యులుగా ఆగొల్ల చంద్రశేఖర్, దావాల వెంకటేశ్వరరావు, వేము శ్రీహరి, గారపాటి రాజారామ్మోనరావు ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులచే కన్వీనర్ కుకునూరి సీతారామకృష్ణారావు, కో–కన్వీనర్ ఇన్నమూరి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

సాల్వేషన్ ఆర్మీ సేవలు అభినందనీయం



సాల్వేషన్ ఆర్మీ జెండాను ఆవిష్కరించిన డివిజనల్ కమాండర్ ఏసురాజ్యం, లతమ్మ

దెందులూరు: ప్రపంచ వ్యాప్తంగా 134 దేశాల్లో సాల్వేషన్ ఆర్మీ ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు పలు రకాల సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయమని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజ్యం మేజర్ లతమ్మ అన్నారు. ఆదివారం దెందులూరు గౌడ వీధిలోని మిలీనియం సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చికి ఏలూరు జిల్లాకు నూతన డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజ్యం లతమ్మ విచ్చేశారు. దెందులూరు కోర్ ఆఫీసర్ కాకి రమణయ్య సువర్ణబ్బాయి చర్చి స్థలదాత పల్లె హర్షవర్ధన్ సిలువకుమారి సంఘ పెద్దలు గంగాధర్‌రావు ఫణికుమార్ సంఘస్తులు ఘనంగా స్వాగతం పలికారు. తొలిత చర్చి వద్ద సాల్వేషన్ ఆర్మీ పథకాన్ని ఎగురవేశారు.

కౌలు రైతులకు అందని వ్యవసాయం

- కూలీలుగా మారుతున్న కౌలు రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం.. అందని సాయం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయాధికారులు



కూలీ పనులు చేస్తున్న కౌలు రైతులు

పెదవేగి: ఆరుగాలం కష్టపడి పనిచేసినా ప్రతిఫలం లేకపోవడమే కాక అప్పుల బాధలు పెరగడంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో అనేక మంది వరిసాగు చేసే కౌలు రైతులు కూలీలుగా మారుతున్నారు. ప్రతి ఏటా ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇప్పటికే కొంత మంది పలు రంగాల్లో కూలీలుగా చేరారు. మరి కొందరు నగరాలకు వెళ్లి పరిశ్రమల్లో పని చేస్తున్నారు.

సాగు వివరాలిలా..

దెందులూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 18 వేల ఎకరాలను 13,756 మంది రైతులు సాగు చేస్తున్నారు. పెదవేగి మండలంలో 4804, దెందులూరులో 3640, పెదపాడులో 5312 మంది కౌలు రైతులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా వాటి ప్రతి ఫలాలు వారికి అందడం లేదు. అసలు పంట సాగుపై, వాతావరణ పరిస్థితులపై కొంత మందికి అవగాహన లేకపోవడం కూడా పంట నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అనేక మంది కూలీలుగా మారుతున్నారు.

పంట నష్టంతో కూలికి వెళుతున్నా

25 సంవత్సరాలుగా కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. గతసార్వాలో 3 ఎకరాలు సాగుచేస్తే రూ.30 వేలు పంట నష్టం వచ్చింది. దాళ్వాలో మరింత అప్పుల పాలవుతాననే భయంతో సాగుకు దూరంగా ఉన్నాను. ఈ ఏడాది కూలికి వెళుతున్నాను.

– నెరుసు నాగధర్మరాజు, గార్లమడుగు

ప్రభుత్వమే ఆదుకోవాలి

10 సంవత్సరాల నుంచి కౌలుకు చేస్తున్నాను. గత సార్వాలో ఎకరా పొలం సాగు చేశా. రూ 20 వేలు పంట నష్టం వచ్చింది. ప్రస్తుతం సాగునీటి కొరత ఉంది. ఇప్పుడు సాగు చేస్తే అప్పులు మరింత పెరిగిపోతాయి. దీంతో కూలీ పనులకు సిద్ధమయ్యాను.

– ఎం.మాణిక్యాలరావు, కొవ్వలి

రైతులు కూలీలుగా మారడానికి కారణాలు ఇవే..

- వరి ధాన్యానికి కనీస మద్దతు ధర లేకపోవడం.
- ప్రతిఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో సంభవించే ప్రకృతి విపత్తులకు పంట నష్టపోవడం.
- ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయి పెట్టుబడులు అధికం కావడం.
- ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పెట్టుబడి రాయితీ, పంటల బీమా పథకం ద్వారా వచ్చే ప్రయోజనం కౌలు రైతులకు అందకపోవడం–బ్యాంకుల ద్వారా కొంతమందికే రుణాలు అందడం
- రబీలో సాగునీటి కొరత ఏర్పడటం.

ఇలా చేస్తే మేలు

- డ్రమ్‌సీడర్, వెదజల్లడం, యంత్రాలను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలి.
- ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలి.
- సాగునీటి కొరత నేపథ్యంలో మినుములు, నువ్వులు వంటి ఇతర పంటల సాగుకు సిద్ధం కావాలి.
- ప్రభుత్వం రైతు శిక్షణ తరగతుల ద్వారా పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి.
- పంట నష్టపోయినపుడు కౌలు రైతులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. పూర్తి స్థాయిలో రుణాలు ఇవ్వాలి.

నేటి నుంచి రైల్వే గేట్ మూసివేత



నేటి నుంచి మరమ్మతుల కారణంగా మూతపడనున్న భీమడోలు రైల్వే గేట్

భీమడోలు: భీమడోలులో రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ సోమ వారం నుంచి 24వ తేదీ గురువారం సాయంత్రం వరకు గేటును రైల్వే అధికారులు మూసి వేస్తున్నారు. భీమడోలు, పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య గల 361 నంబర్ గల భీమడోలు ట్రాక్ మరమ్మతులు చేపడుతున్నట్లు రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీరు పేర్కొన్నారు. పలు వాహనదారులు, పశువుల పెంపకందారులు, రైతులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు సూచించారు. అయితే ప్రస్తుతం ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నందున రైల్వే ట్రాక్ మరమ్మతులతో ఇబ్బందులు పడతామని రైతులు అంటున్నారు. పాతూరు, వడ్లపట్ల అండర్ బ్రిడ్జిల నుంచి రాకపోకలు సాగించడం చాలా ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు చెబుతున్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

చింతలపూడి: స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సు దిగుతున్న ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం చాట్రాయి గ్రామానికి చెందిన తుమ్మల లక్ష్మి మండలంలోని పట్టాయిగూడెం గ్రామంలోని తన సోదరి ఇంటికి వెళ్తూ బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ జారిపడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుండి విజయవాడకు తరలించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ ప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రజా ప్రతినిధులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఈవీఎంల చీకటి కోణం బహిర్గతం అవుతుందని ప్రజల దృష్టిని మరల్చేందుకే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. రాజకీయాలు హుందాగా ఉండాలే తప్ప కక్షపూరితంగా దాడులు దౌర్జన్యాలు హత్యాయత్నాలు ప్రధాన లక్ష్యం కాకూడదన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోయిందని అన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి అధికమవడంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇటువంటి చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు రాష్ట్ర కార్యదర్శుల అభిప్రాయాలు వారి మాటల్లో వివరించారు. – దెందులూరు

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అన్యాయం

భీమడోలు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో లిక్కర్ పాలసీ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అన్యాయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో ఆయన ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వ విధానాన్ని మార్చుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీలో కీలకంగా ఉన్న నేతలపై కూటమి తప్పుడు కేసులు పెడుతుందని, మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. నియోజకవర్గంలో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మిథున్‌రెడ్డి అరెస్ట్ కూటమి పతనానికి నిదర్శనమన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ భీమడోలు మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ అన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే అరెస్ట్



ప్రజల దృష్టి మరల్చేందుకే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గం. ప్రజలు గమనిస్తున్నారు. దీనికి కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్

ఎంపీ అరెస్ట్ అక్రమం



ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం. న్యాయస్థానంలో నిర్దోషిగా మిథున్‌రెడ్డి బయటకు వస్తారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ అభివృద్ధి మూలన పడింది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు.

– మండల సరస్వతి, జెడ్పీటీసీ ఏలూరు

ఎంపీ మిథున్‌రెడ్డికి అండగా ఉంటాం



ఎంపీ మిథున్‌రెడ్డికి, ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల శ్రేణులు అండగా ఉంటాం. అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తున్నాం. ఈ అరెస్టు చాలా బాధాకరం. ఈ విధానం మారాలి.

– పోతల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

కడిగిన ముత్యంలా బయటికి వస్తారు



ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. ప్రజా ప్రతినిధులను తమ వైపుకు తిప్పుకునేందుకు ఆఖరి అస్త్రంగా అక్రమ అరెస్టులను చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇటువంటి చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదు.

– డీబీఆర్‌కే చౌదరి, పార్టీ జిల్లా కార్యదర్శి

పెద్దింట్లమ్మకు సారె సమర్పణ



శాకంబరి అలంకరణలో పెద్దింట్లమ్మ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

దెందులూరు: దెందులూరులోని శ్రీపెద్దింట్లమ్మకు ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా ఆలయ కమిటీ, 10 మంది భక్తులు అమ్మవారికి 25 రకాల కూరగాయలు, 5 రకాల ఆకు కూరలు మొత్తం 200 కేజీల శాఖాహార అలంకరణ చేశారు. అనంతరం పెద్దింట్లమ్మకు ఆషాఢమాసం సారెను సమర్పించారు. కొవ్వలి దెందులూరు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గంగానమ్మకు..

పెదపాడు: స్థానిక గండి చెరువు గట్టులోని గంగానమ్మ, బళ్లరేవు తూము సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవార్లకు సారె చీరలను సమర్పించారు. ఆదివారం పురస్కరించుకొని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించి, అనంతరం గ్రామంలో సారె చీరలను గ్రామోత్సవం నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలను, ఆషాడం సారెను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

దెందులూరు: మండలంలో ఆదివారం దెందులూరు, పోతునూరు గ్రామాల్లో పేకాట ఆడుతున్న వారిని దాడి చేసి పట్టుకున్నామని ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. దెందులూరులో రూ.14 వేలు, పోతునూరులో రూ.16300 నగదు సీజ్ చేశామని తెలిపారు. రెండు గ్రామాల్లో 14 మందిని అరెస్ట్ చేశామని ఎస్సై వివరించారు. మండలంలో ఏ గ్రామ శివారు ప్రాంతంలోనైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా, సహకరించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తులు పోలీసుల నిఘాలో ఉన్న విషయాన్ని గమనించాలని ఎస్సై అన్నారు.

చర్మకారులకు పింఛన్ మంజూరు చేయాలి

దెందులూరు: జిల్లాలో దశాబ్దాలుగా వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న చర్మకారులు డప్పు కళాకారులకు పింఛన్లను మంజూరు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.మురళి డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వారసత్వంగా వచ్చిన వృత్తితో తమతో పాటు కుటుంబ సభ్యులను పోషించుకుంటున్న చర్మకారులు, డప్పు కళాకారులు పింఛన్ లేకపోతే వారి జీవన విధానం ఎలాగని ప్రశ్నించారు. వేలాది మంది ఉపాధి లేక, ప్రోత్సాహం అందక జీవనం దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం డప్పు కళాకారులు, చర్మకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు జీవన భద్రత కల్పించాలని అన్నారు.

ఉసూరుమనిపిస్తున్న వర్షాలు

- ముఖం చాటేస్తున్న వరుణుడు
- పంటల సాగుకు నోచుకోని పొలాలు
- అదును దాటుతుందని అన్నదాతల ఆందోళన



బుట్టాయగూడెం సమీపంలో వర్షాలు లేక ఎండుతున్న వరి నారుమడి



బోర్ల కింద వరినాట్ల కోసం ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: వర్షాలు ముఖం చాటేయడంతో సాగు నీరు లేక ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం ఆరంభంలోనే తొలకరి వానలు పడడంతో గంపెడాశలతో సాగు చేపడదామనుకున్న రైతులకు ఆ తరువాత వానల జాడ రాకపోవడంతో అమోయమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. జూలై మాసం మరో పది రోజుల్లో ముగియనున్న ఇంత వరకూ సరైన వర్షాలు లేకపోవడంతో అదును దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలవరం నియోజకవర్గంలోని వర్షాభావ పరిస్థితులు రైతులను వెంటాడుతున్నాయి. ఆకాశం మేఘావృతం కావడం కొద్దిపాటి చినుకులు పలుకరించి పోవడం ఆ తర్వాత ఆవిరి కావడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తూ నిరాశ చెందుతున్నారు. ఏటా జూన్ నెలాఖరులోని ఆరుద్ర కార్తెకంతా వర్షాలు కురిసి రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యేవారు. అలాంటిది పెద్ద పునర్వసు కార్తె దాటి చిన పునర్వసు కార్తె వస్తున్నా ఇంకా వరుణుడు కరుణ చూపడంలేదని రైతులు నిరాశ చెందుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 32,663 హెక్టార్లలో పంటల సాగు చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే వర్షాలు ఆశించినంత కురవకపోవడంతో పొలాల్లో విత్తనం ఎప్పుడు వేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ఏడాది జూలై మొదటి వారం నాటికి 90 శాతం సాగు పూర్తయింది. ఈ ఏడాది జూలై 20వతేదీ దాటినా వర్షాభావ పరిస్థితుల వల్ల 30 శాతం మాత్రమే సాగు పనులు జరిగినట్లు తెలుస్తోంది.